# పెద్దనోట్ల రద్దు - అక్రమార్జనను, నల్ల ధన ప్రవాహాన్ని ఆపగలదా?

## 1. నల్ల ఆర్థిక వ్యవస్థ - నల్లడబ్బు, మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగం :

బహిర్గతం కాని అక్రమ సంపాదనలో నల్లడబ్బు నోట్ల రూపంలో ఉండేది కేవలం ఒక శాతం నుండి గరిష్టంగా ఆరు శాతం ఉండవచ్చునని అంచనాలున్నాయి. అక్రమ సంపాదనలో చాలా భాగం నిరంతరమూ నోట్లేతర ఆస్థులుగా రూపాంతరము చెందుతూ వుంటుంది. అంటే భూములు, ఇండ్ల స్థలాలు, ఇండ్లు, బంగారం లాంటి ఆస్థులుగా మారిపోతూ ఉంటుంది. ఇలాంటి ఆస్థులు నల్లవా, తెల్లవా అని నిర్ధారించడం కష్టం. మరి కొంత భాగం విద్య, ఆరోగ్య ఖర్చులతోపాటు, విలాసవంతమైన జీవనానికి ఖర్చు చేస్తుంటారు.  ఉదా॥ విదేశ పర్యటనలు, విలాస వస్తువుల కోనుగోలు మొదలగు ఖర్చులు. ఇంకొంత మంది అక్రమ సంపాదనతో పిల్లల చదువుకోసం లక్షల ఫీజులు చెల్లిస్తూంటారు. ఆ ఫీజులకు రశీదులు ఇస్తారు. తల్లిదండ్రుల చేతిలో నల్ల డబ్బు కాలేజీ యాజమాన్యాలకు చేరినప్పడు తెల్ల డబ్బు అయిపోతుంది. రశీదులు ఇవ్వకుండా తీసుకొనే డొనేషన్లు, కాపిటేషన్ ఫీజులు మాత్రము యాజమాన్యాల దగ్గర నల్లడబ్బుగా చేరి, తిరిగి నోట్లేతర ఆస్థులుగా మారిపోతూ ఉంటుంది. ఇలా నలుపు – తెలుపుగా మారుతూ, మొత్తం ఆర్థిక వ్యవస్థలో ఒక భాగంగా అంతర్లీనమై ఉంటుంది. కేవలం పెద్ద నోట్ల రూపంలో ఇండ్లలో దాచుకునేది అత్యల్పంగా వుంటుంది. దొంగలకు, ఆదాయపు పన్ను అధికారుల దాడులకు భయపడడం, దాచుకునే అవకాశాలు లేకపోవడంతోపాటు, నోట్ల రూపంలో విలువ తరుగుతుంది కావున దాచుకోవడం అరుదే. ఆస్థుల రూపంలో అయితే విలువ కూడా పెరుగుతుంది. అందుకే చాలా వరకు నోట్ల రూపంలో అక్రమ సంపాదన అత్యల్పస్థాయిలో మాత్రమే ఉంటుంది.

## 2. విదేశాలలో దాచుకున్న నల్లడబ్బు :

మన దేశంలో అక్రమంగా సంపాదించి, దానిని నోట్ల రూపంలో గోప్యంగా ఇతర దేశాలకు తరలించి, అక్కడి బ్యాంకులలో దాచుకున్నది మాత్రం నూటికి నూరుపాళ్ళు నల్లధనంగానే వుంటుంది. అది మన దేశ ఆర్థిక వ్యవస్థ నుండి పెద్ద మొత్తంలో తస్కరింపబడి, మన ఆర్థిక వ్యవస్థను బలహీనపరచి, వ్యక్తుల సొంత ఆస్థిగా, గోప్యంగా వుంటుంది. ఈ విధంగా విదేశాలలో దాచిన నల్లడబ్బును మనం రాబట్ట గలగితే అది మన ఆర్థిక వ్యవస్థకు తోడై బలోపేతం చేస్తుంది. ఆ నల్ల ధనవంతులను తీవ్రంగా శిక్షించగలిగితే, విదేశాలకు పోయే డబ్బు ఆగిపోతుంది.

## 3. మన దేశంలో అక్రమ సంపాదనకు మూలాలు ఎక్కడ?

ఆక్రమ సంపాదనను, నల్ల డబ్బును, నల్ల ఆస్థులను అరికట్టాలంటే వాటి మూలాలను అరికట్టాలి. మన దేశంలో భారీగా అక్రమ సంపాదన అక్రమ ఖర్చులు చేస్తున్న వర్గాలలో ప్రధాన రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు, బడా పారిశ్రామిక సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, గుత్తేదార్లు, కొంత మంది కీలకస్థాయి అధికారులు వుంటారు. తరువాత స్థానంలో కింది స్థాయి రాజకీయ నాయకులు, గుత్తేదార్లు, వ్యాపారస్థులు, ఉద్యోగస్థులు ఉంటారు. అయితే అక్రమ సంపాదన అన్ని స్థాయిలలోనూ, అన్ని రంగాలలోనూ ఉన్నది బహిరంగా రహస్యమే! అన్ని స్థాయిలలోనూ, అన్ని రంగాలలోనూ కొంత వరకు నిజాయితీ గల సంస్థలు, నిజాయితీ గల వ్యక్తులు ఉన్నది కూడా వాస్తవమే!

అయితే అక్రమ సంపాదనకు మూలము మొదటిది రాజకీయ పార్టీలు ఎన్నికలలో పెట్టే అక్రమ ఖర్చులు. రెండవది అవినీతికి పాల్పడే కొంత శాతం రాజకీయ నాయకులు మరియు అధికారులు. దాదాపు అన్ని రాజకీయ పార్టీలు మరియు అత్యధిక శాతం రాజకీయ నాయకులు అక్రమ సంపాదన చేసి, ఎన్నికల సమయంలో అందులో కొంత భాగాన్ని అక్రమంగా ఖర్చు చేస్తున్నారనేది బహిరంగ రహస్యమే. మిగిలిన అక్రమార్జనను వివిధ ఆస్థుల రూపంలోకి మార్చుకుంటారనేది బహిరంగ రహస్యమే! పారిశ్రామిక సంస్థలు, పెట్టుబడిదారులు, గుత్తేదార్లు ప్రభుత్వ వనరుల ఆక్రమ దోపిడీ ద్వారానూ, అక్రమంగా పారిశ్రామిక లైసెన్సులు పొందడం ద్వారానూ, హెచ్చించిన కాంట్రాక్టుల ద్వారానూ, అక్రమంగా సంపాదించి, పార్టీలకు, నాయకులకు నల్లధనం లేదా ఆస్థుల రూపంలో ఇస్తున్నారనేది బహిరంగ రహస్యమే, కాబట్టి రాజకీయ వర్గాలు, అధికార వర్గాలు, పారిశ్రామిక వర్గాలు ఒకరినొకరు ప్రజాధనం, ప్రభుత్వ వనరుల దోపిడీ ద్వారా అక్రమార్జన చేసి అన్యోన్యంగా పోషించుకుంటున్నారనేది బహిరంగ రహస్యమే! ఈ అక్రమ దోపిడీ పరస్పర పోషణ పైస్థాయిలో భారీ మొత్తంలో మొదలై క్రింద గ్రామస్థాయి వరకు అన్ని స్థాయిలలో వివిధ మోతాదులో ఉండటమే అవినీతికి అక్రమార్జనకు మూలము. అన్ని స్థాయిలలోనూ వ్యక్తులుగా కొంత శాతం నీతికి, నిజాయితీకి కట్టుబడి వుండే వాళ్లు ఉన్నారు. కానీ వ్యవస్థలుగా దాదాపు అన్ని రంగాలలోనూ అక్రమార్జన ఒక భాగంగా వుందనడం కఠోర వాస్తవం! అంటే ఏ వ్యవస్థలైతే దేశ ప్రజలకు ఆదర్శవంతంగా వుండి, సహజవనరులను, పర్యావరణాన్ని, ప్రజా ధనాన్ని రక్షించి, సుపరిపాలన అందించాలో ఆ వ్యవస్థలే "కంచే చేనును మేసినట్లు" అక్రమార్జనకు, నల్ల ఆర్థిక వ్యవస్థకు పునాదులుగా వున్నాయి.

## 4. పెద్ద నోట్ల రద్దుతో నల్ల ధనాన్ని అరికట్టవచ్చునా?

ఇంతకు ముందే చెప్పినట్లు నోట్ల రూపంలో వుండే అక్రమ ఆస్థులు ఆరు శాతానికిలోపే. కాబట్టి నల్ల ధన వ్యవస్థపై నోట్ల రద్దు ప్రభావం పరిమితంగానే వుంటుంది. నల్ల ధన వ్యవస్థను అరికట్టాలంటే నల్ల ధన మూలాల నుండి ప్రవాహాన్ని ఆపవలసి వుంటుంది. కాబట్టి పెద్ద నోట్ల రద్దు ముక్కుతుడుపు మాత్రమే. ముక్కుతుడుపు ద్వారా పడిశము అనే జబ్బు మానదు. ముక్కుతుడుపు పడిశానికి మందు కాలేదు. వాస్తవంగా పెద్దనోట్లు రద్దు కాలేదు. పాతనోట్ల స్థానంలో కొత్త నోట్లను ఇంకా పెద్ద రూ. 2,000ల నోటును విడుదల చేసినారు. అక్రమార్జనను, నల్ల ధన ప్రవాహాన్ని అరికట్టాలంటే రాజకీయపార్టీలు, నాయకులు, బడా పారిశ్రామిక వేత్తలు, గుత్తేదార్లు ప్రభుత్వ అధికారుల మధ్యగల అక్రమ లావాదేవీలను, అవినీతిని పై నుండి క్రింది వరకు అరికట్టాలి. ఎన్నికల ఖర్చును పూర్తిగా ప్రభుత్వమే భరించాలి. అవినీతికి అక్రమ సంపాదనకు పాటుబడే వారిని కఠినంగా శిక్షించాలి. ప్రస్తుతం జరుగుతున్న అవినీతికి, అక్రమ లావాదేవీలకు దాదాపు అన్నింటికీ రాజకీయ ప్రభుత్వ వర్గాల అండదండలు ఉన్నాయి. అక్రమార్జనను, అక్రమ ఖర్చులను అరికట్టడానికి ధృడమైన రాజకీయ సంకల్పం కావాలి. అత్యున్నత స్థాయిలో రాజకీయ పార్టీలలో పూర్తిగా పరివర్తన రావాలి. రాజకీయ ఎన్నికల సంస్కరణలు రావాలి. నీతికి, నిజాయితీకి, నిస్వార్ధ రాజనీతిజ్ఞతకు, జవాబుదారీతనానికి, పారదర్శకతకు పెద్ద పీట వేయాలి. అప్పుడే ఈ అక్రమార్జున ప్రవాహం ఆగి ఈ జబ్బు నుండి ఉపశమనం లభిస్తుంది.

## 5. పాత పెద్ద నోట్ల రద్దుతో ఏ మవుతున్నది?

ఒక కథ ఇందుకు సరిగ్గా అద్దం పడుతుంది. ఒక పెద్ద చెరువులో కొన్ని మొసల్లు ఉండేవి. ఆ మొసల్లకు భయపడి చెరువుకు నీళ్ళ కోసం ఇతర జంతువులు వచ్చేవి కావు. కాబట్టి చెరువు యజమాని మొసల్లను చంపాలని భావించి, చెరువులోని నీటినంతటినీ వదిలేసినాడు. పర్యవసానంగా చెరువులోని చేపలు, కప్పలు, మిగిలిన చిన్న ప్రాణులన్నీ చనిపోయినాయి. మొసల్లు నీటి లోపల, నీటి బయట కూడా నడవగలవు కాబట్టి భూమి మీద ప్రాకి ఇంకో చెరువును చేరుకున్నాయి. ఇదే జరుగుతున్నది పాత నోట్ల రద్దుతో, పెద్ద పెద్ద నల్ల కుబేరులకు ఇలాంటి పరిస్థితులలో ఎట్లా బయటపడాలో బాగా తెలుసు. కాబట్టి వారు చాలా మంది తప్పించుకొనుచున్నారు. వారికి రాజకీయ అండదండలు కూడా వుంటాయి. అవినీతి అధికారులు కూడా వారికి సహకరిస్తారు. వారెవరు డబ్బు కోసం వారానికి 4, 5 రోజులు క్యూలలో ఇబ్బందులు పడుతున్నట్లు ఎక్కడా అనుపించలేదు. అయితే సాధారణ ప్రజలు, ముఖ్యంగా రైతులు, దిన కూలీలు, చిన్న వ్యాపారులు, చిన్న హోటల్లు, వృద్ధులు, దివ్యాంగులు, రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నా, చితక జీవనోపాధులు ఛిన్నాభిన్నమోతున్నాయి. నీటి బయట పడేసిన

చేపల్లా గిలగిల కొట్టుకుంటున్నారు. రైతులు పంటను అమ్మడానికి లేదు. ఎరువులు, మందులు, విత్తనాలు కొనడానికి లేదు. అన్ని రంగాలలోనూ కూలీలకు కూలీ పుట్టడం లేదు. నిర్మాణరంగం స్తంభించి పోయింది. చిన్న వ్యాపారులు మూసేయవలసి వచ్చింది. బ్యాంకులో డబ్బున్నా రోగులు చచ్చే పరిస్థితులు నెలకొన్నాయి. నూర్ల సంఖ్యలో వృద్ధులు, రోగులు క్యూలలో నిలబడలేక చనిపోతున్నారు.

వృద్ధులు, దివ్యాంగులు, పెన్షన్లు రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. పాలక, ప్రభుత్వ వర్గాలు పాతనోట్ల రద్దును స్ట్రిజికల్ స్ట్రైక్ గా అభివర్ణించివారు. కానీ ఇది మధ్య తరగతి, పేద వర్గాల మీద బ్లాంకెట్ బాంబింగ్‌గా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నది. రాజకీయ, ధనిక వర్గాలు తప్ప మిగిలిన జనాభా వారానికి మూడు నాలుగు రోజులు బ్యాంకులు, ఎ.టి.యంల ముందు క్యూలలోనే గడపాల్సివస్తుంది. బ్యాంకులో అకౌంటు లేకుండా వుండే కూలీలు, చిన్న వ్యాపారులు ఆర్థిక వ్యవస్థ నుండి బయటకు నెట్టివేయబడి, జీవనోపాధులు కోల్పోయి, నిరుద్యోగులుగా తిండి కోసం తిప్పలు పడుతున్నారు.

మన దేశములో ప్రభుత్యోగులు 1.75 కోట్ల మంది వున్నారు. ప్రైవేటు సంస్థలలో (పరిశ్రమలు) 1.14 కోట్ల మంది వున్నారు. మొత్తంగా సంఘటిక రంగములో (organised sector) 2.89 కోట్ల మంది మాత్రమే వున్నారు. అదే ఆసంఘటిత రంగములో (unorganised sector) చిన్న ఉద్యోగులుగా, కూలీలుగా పని చేసే వారు ఏకంగా 44 కోట్ల మంది వున్నారు. ఈ అసంఘటిత రంగంలోని 44 కోట్ల మందికి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. ఈ బాధలన్నీ కొన్ని నెలలలో తొలగిపోవచ్చునని చెపుతున్నారు. కానీ కొన్ని వర్గాలకు ఈ బాధలు కొన్ని సంవత్సరాల కాలం తప్పకపోవచ్చు. పాత పెద్ద నోట్ల రద్దు వలన నల్ల ధన ప్రవాహము ఆగిపోతే ఈ ఇబ్బందులను ప్రజలు సహిస్తారు.

## 6. పాతనోట్ల రద్దు వలన ఎవరికి మేలు జరుగుచున్నది?

పాతనోట్ల రద్దు వలన ముఖ్యంగా బ్యాంకులకు మేలు జరుగుచున్నది. ప్రస్తుతం బ్యాంకులలో నిరర్థక ఆస్థులు (Non-performing Assets) ఆమోదస్థాయికి మించి పెరిగి పోయినాయి. విజయ మాల్యా లాంటి బడా పారిశ్రామిక వేత్తలు లక్షల కోట్లలో బ్యాంకుల నుండి అప్పులు తీసుకొని మొండి బకాయిలుగా మిగిలి పోయినారు. దాని వలన బ్యాంకులు సంక్షోభంలోకి నెట్టబడినాయి. ఈ సంక్షోభం నుండి బయటపడటానికి ప్రభుత్వము అదనపు పెట్టుబడిని బ్యాంకులకు ఇవ్వవలసి వస్తున్నది. ఈ తరుణంలో పాత నోట్ల రద్దు మూలంగా ప్రజల దగ్గర చెలామణిలో వున్న నగదంతా బ్యాంకులకు చేరుచున్నది. అంటే బ్యాంకులలో డిపాజిట్లు పెరిగి, నిరర్థక ఆస్థుల శాతం తగ్గిపోయి, సంక్షోభం నుండి బయట పడగలవు. అదనంగా పెద్ద నోట్ల రూపంలో వున్న నల్లధనం కొంత వివిధ మార్గాల ద్వారా తెల్ల ధనంగా

మారుతున్నది. తద్వారా పన్నుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు కొంత ఆదాయం పెరుగుతుంది. ఎంత మొత్తం ఈ విధంగా తెల్ల ధనంగా మారింది, ప్రభుత్వానికి పన్ను రూపంలో ఎంత అదనంగా వస్తుంది అనేది తెలుసుకోవాలంటే ఇంకొంత కాలం పడుతుంది.

దీని మూలంగా తాత్కాలికంగా దేశ స్థాయిలో ఉత్పాదకత తగ్గి జి.డి.పి వృద్ధి రేటు తగ్గుతుందని అంద రూ ఒప్పుకుంటున్నారు.  తిరిగి వృద్ధి రేటు ఎపుడు, ఎట్లా పుంజుకుంటుంది అనే దానిపై వాస్తవ అంచనాలు లేవు.  దీర్ఘకాలములో మంచి సత్ఫలితాలనిస్తుందని పాలక, ప్రభుత్వ వర్గాలు వాదిస్తున్నాయి.

## 7. నగదు రహిత ఆర్థిక వ్యవస్థ తొందరలో సాధ్యమా?

నల్ల ధన ప్రవాహాన్ని ఆపడానికి ప్రభుత్వము ఎంచుకున్న ముఖ్య మార్గము పాత పెద్ద నోట్ల రద్దుతో పాటు, నగదు రహిత ఆర్థిక వ్యవస్థను వేగవంతంగా తీసుకొనిరావడం. అంత వేగంగా నగదు రహిత వ్యవస్థను సాధించడం సాధ్యమా? ప్రస్తుతం మన దేశంలోని జనాభా దాదాపు 130 కోట్లు అయితే అందులో కేవలం 5 కోట్ల మంది మాత్రమే క్రెడిట్ లేదా డెబిట్ కార్డులను కొన్ని లావాదేవీలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. ప్రపంచస్థాయిలో పోటీ పడగల సమాచార – సాంకేతిక పరిజ్ఞానము (Information and Communication Technology – ICT) మన దేశంలో వుంది. అయితే అది కేవలం 5 శాతం మందికి అందుబాటులో వుంటే 95 శాతము మందికి అది అందనంత దూరంలో వుంది. ఈ వ్యత్యాసాన్ని డిజిటల్ డివైడ్ (Digital Divide) అంటారు. మన దేశంలో దాదాపు 50 శాతం జనాభా వాస్తవ నిరక్షరాస్యులుగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకులు అందరికీ అందుబాటులో లేవు. అంతర్జాలం సదుపాయం (Internet) అందరికీ అందుబాటులో లేదు. సాంకేతిక మౌలిక సదుపాయాలు విస్తారంగా అభివృద్ధి చెందలేదు. స్మార్ట్ ఫోను (Smart Phone) లాంటి సాంకేతిక పరికరాల కొనుగోలు శక్తి అందరికీ లేదు. అసంఘటిత రంగంలో అధికంగా, నగదు ఆధార లావాదేవీలు ముఖ్యంగా రైతులు, వివిధ రంగాలలోని చిన్న పరిశ్రమలు, చేతివృత్తులు, గ్రామీణ వర్తకం, దినకూలీలు, చిన్న మార్కెట్లు, చిన్న వ్యాపారులు, చిన్న హోటల్లు మొదలగునవి ఉన్నాయి. ఇవి మన జనాభాలో అత్యధిక మందికి బ్రతుకు దెరువులుగా వుంటూ, ఆర్థిక వ్యవస్థలో కూడా సింహ బాగంగా వున్నాయి. వీరందరూ చాలా వరకు బ్యాంకులకు, సమాచార సాంకేతిక విప్లవానికి దూరంగా వుంటున్నారు. కాబట్టి మన దేశంలో నగదు రహిత ఆర్థిక వ్యవస్థ తేవడానికి తీవ్రంగా ప్రయత్నించినా కొన్ని సంవత్సరాలైనా పడుతుంది. కాబట్టి ఇది సత్వర పరిష్కారం అవడానికి అవకాశము లేదు, ప్రస్తుతం ప్రపంచంలో స్వీడన్, నార్వే, డెన్మార్కు లాంటి బాగా అభివృద్ధి చెందిన కొన్ని దేశాలలో మాత్రమే అధిక స్థాయిలో నగతు రహిత లావాదేవీలు జరుగుచున్నాయి. ఇంకా అమెరికా, యూరోపు లాంటి అభివృద్ధి చెందిన దేశాలలో కూడా దాదాపు 50 శాతం నగదు లావాదేవీలు జరుగుతున్నాయి.

## 8. అక్రమ సంపాదనను, నల్లధనాన్ని ఎలా అరకట్టాలి?

మొట్ట మొదటగా మనం గుర్తించాల్సిన అంశములు రెండు

1. మన దేశంలో నైతిక విలువల పతనం తారాస్థాయికి చేరింది.
2. రాజకీయ వ్యవస్థ మరియు పెట్టుబడి దారీ వ్యవస్థ రెండు కలగలిసి ఆశ్రిత పెట్టుబడిదారి వ్యవస్థ ఏర్పడింది.

పై రెండు అంశాలు కలిసి పరస్పర అక్రమ పోషణతో మన దేశ ప్రజలలో అనైతికతను, అవినీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని, బాధ్యతా రాహిత్యాన్ని, రహస్య సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాయి. మొదటిగా చట్టాలను ఉల్లంఘించేది రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థలే అనే భావన సాధారణ ప్రజలలో వుంది. ఇటువంటి పరిస్థితులలో అక్రమ సంపాదనకు అన్ని స్థాయిలలో ముగింపు కావాలంటే రాజకీయ వ్యవస్థలో మార్పు కోసం ధృడమైన రాజకీయ సంకల్పం రావాలి, లేదా ఈ వ్యవస్థపై ప్రజలు తిరుగుబాటైనా చేయాలి. తద్వారా నైతిక విలువల పునరుద్దరణ జరిగి, రాజకీయ, ప్రభుత్వ, పారిశ్రామిక రంగాలలో పరివర్తన జరగాలి. అంటే సమస్యను మూలాల నుండి పరిష్కరించే ప్రయత్నం చేయాలి. అందుకు విడి విడి (piece meal) చర్యలుగాకుండా ఒక సమగ్రమైన బహుముఖ వ్యూహము కావాలి. రాజకీయ పార్టీల నిధుల సేకరణలోనూ, ఖర్చు పెట్టడంలోనూ పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం రావాలి. ఎన్నికల ఖర్చులను ప్రభుత్వమే భరించి పార్టీలు, వ్యక్తులు ఖర్చుపెట్టే విధానం పోవాలి. పారిశ్రామిక సంస్థలకు వనరులు, లైసెన్సులు, కాంట్రాక్టులు మరియు ఋణాలు మంజూరు మొదలగు అంశాలు పూర్తి పారదర్శకంగా జరగాలి.

రాజకీయ వర్గాల లాలూచీతోనే విజయ మాల్యా, లలిత్ మోడి లాంటి వాళ్ళు ప్రజాధనం దోపిడి చేసి ఇంగ్లాండుకు వెళ్ళిపోయి సుఖంగా వుంటున్నారు. తారా స్థాయిలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణ లున్న రాజా, కనిమొళి, మారన్, కల్మాడీలు కూడా బాగనే ఉన్నారు. వారి కేసులు పరిష్కారమయ్యే వరకు వారు జీవించి వుండకపోవచ్చు. ఇటువంటి వారిని కఠినంగా, త్వరగా శిక్షించే విధంగా చట్టాలు, అమలు వ్యవస్థలు ఉండాలి. వారికి సహకరించిన రాజకీయ నాయకును, ప్రభుత్వాధికారులను కూడా కఠినంగా శిక్షించాలి. రాజకీయ అవినీతిని అరికట్టేందుకు ఉద్దేశింపబడిన లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థలను పటిష్టపరచి, కఠినంగా ఆచరణలోకి తీసుకొని రావాలి. సమాచార హక్కు చట్టానికి ఇంకా పదును పెట్టి అన్ని స్థాయిలలో పారదర్శకత తీసుకొని రావాలి. రాజకీయ పార్టీలు సమాచార హక్కు క్రిందికి తీసుకొని రావాలి. అవినీతి నిరోధక చట్టాలు, అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి, బంధుప్రీతికి బలైపోతుండా కఠినంగా అమలు చేయాలి. కాబట్టి చాలా వరకు సమస్యకు మూలాలుగా వున్న మన రాజకీయ వ్యవస్థ మరియు ఎన్నికల సంస్కరణలతో మొదలు కావాలి. అక్కడ

నుండి అన్ని స్థాయిలలోనూ, గ్రామ స్థాయి వరకు సంస్కరింపబడాలి. ప్రస్తుతము "ఎదుటి వారికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి" అనే నానుడి ఈ రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థలకు చక్కగా వర్తిస్తుంది. అన్ని స్థాయిలలో సమన్వయముతో సుపరిపాలనను ప్రజలకు అందించవలసిన బాధ్యత రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థల పై వుంది. కాబట్టి ఆ వ్యవస్థలు రెండు ప్రక్షాళన చెంది, దేశానికి అదర్శంగా ప్రజాస్వామ్య విలువలను, నైతిక విలువలను ఆచరించి, చట్టాలను గౌరవించి, ఇతర వ్యవస్థలకు, ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలబడాలి. పైన చెప్పిన విధంగా పరివర్తన మరియు సంస్కరణలు తీసుకొని రాకుండా కేవలం పెద్ద నోట్ల రద్దుతో మరియు నగదు రహిత వ్యవస్థ కోసం ప్రయత్నించచ డంతో సమస్యకు పరిష్కారం వస్తుందని భావించడం అసమంజసం, అసమగ్రం కూడా. ఇప్పటికే ఉన్న చట్టాలనుగానీ ముందుకు చేసే చట్టాలనుగానీ, కఠినంగా యదార్ధంగా రాజీపడకుండా అమలు చేస్తారనే నమ్మకం కూడా ప్రజలలో కల్పించవలసి వుంది.

దురదృష్టకరమేమిటంటే పెద్ద నోట్ల రద్దు తరువాత మీడియాలో జరుగుచున్న చర్చ కంటితుడుపుగా వుంది. సమస్య మూలాల్లోకి వెళ్లి, సంస్కరణలు, శాశ్విత పరిష్కారాల వైపు పోవడం లేదు. రాజకీయ పార్టీలు చర్చలను శాసిస్తు, అప్రధాన అంశాల వైపు మళ్లించి, ఒకరినొకరు తప్పు పట్టుకోవడంతో కాలాన్ని హరిస్తు సరిపెట్టుతున్నాయి. రాజకీయ పార్టీ లేవీ రాజకీయ వ్యవస్థ ప్రక్షాళనకు, ఎన్నికల సంస్కరణలకు సిద్ధంగా, చురుకుగా ముందుకు రావడం లేదు. పార్టీయేతర పౌర సంస్థలు, మేధావు లు, ఆర్థిక నిపుణులు, మీడియా వర్గాలు కూడా వ్యవస్థల ప్రక్షాళన దిశగా చర్చను ప్రజలలోనికి తీసు కొని పోలేకపోతున్నాయి. రాజకీయ పార్టీలు సంస్కరణలను అడ్డుకుంటున్న సందర్భంలో పార్టీ యేతర పౌర సంస్థలు, మేధావులు, మీడియా మొదలగు వ్యవస్థలు మరింత చురుకుగా ప్రజలలోకి చొచ్చుకొనిపోవలసి వుంది.

**తేది :24.12.2016**

**డా॥వై.వి.మల్లారెడ్డి**
డైరెక్టరు, ఏ.ఎఫ్.ఎకాలజీ సెంటరు
అనంతపురం.